క్లుప్తంగా

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ధ్యేయం



మాట్లాడుతున్న దొంత రమేశ్

హుజూరాబాద్: రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేశ్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేశ చరిత్రలో నూతన అధ్యాయానికి శ్రీకరం చుట్టిందని, రుణమాఫీ నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో పాటు పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఓ నోడల్ ఆఫీసర్‌గా నియమించి బ్యాంకులు, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎన్ఐసీకి మధ్య సమన్వయకర్తగా కేటాయించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ప్రతిపక్షాలు చేసే పిచ్చి ఆరోపణలు నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సందమల్ల బాబు, హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి బత్తిని రవీందర్ గౌడ్, నాయకులు దుబాసి బాబు,యువజన కాంగ్రెస్ నాయకులు జంగ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు జరుపుకోవాలి

సైదాపూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రైతాంగానికి ఏకకాలంలో ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడం హర్షనీయమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, డీసీసీ అధికార ప్రతినిధి రవీందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేయడంతో పాటు ఎంపీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీని గురువారం నుంచి ప్రారంభించనున్న నేపథ్యంలో తెలంగాణ రైతాంగం సంబరాలు జరుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.లక్ష వరకే మాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి ఐదేండ్లలో అర్హులందరికీ చేయలేకపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న హరీశ్ రావు మాట తప్పద్దన్నారు.

అధిక సంఖ్యలో హాజరు కావాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం ప్రారంభించనున్న నేపథ్యంలో సైదాపూర్ రైతు వేదికలో కార్యక్రమాన్ని వీక్షించేందుకు మండలంలోని రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఏవో వైదేహి బుధవారం ప్రకటనలో కోరారు. అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

2,500 మంది రైతులకు లబ్ధి

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో దాదాపు 2500 మంది రైతులకు మొదటి విడతలో లక్ష రుణమాఫీ వర్తించనుంది. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. చిగురుమామిడిలోని యూనియన్ బ్యాంకు, సింగిల్‌విండో, చిన్నముల్కనూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఇందుర్తిలోని టీజీ బ్యాంకు, హుస్నాబాద్‌లోని యూకో బ్యాంకుల నుంచి రైతులు పంట రుణాలు పొందారు. వీరి ఖాతాల్లో గురువారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి బటన్ నొక్కి డబ్బులు వేయనున్నారు. రెండు లక్షల రుణమాఫీని ప్రభుత్వం మూడు విడతలుగా విభజించింది.

సిక్కింలో ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రజతోత్సవం

కరీంనగర్: ఆలిండియా గవర్నమెంట్ డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సౌత్ జోన్ చైర్మన్, కరీంనగర్‌కు చెందిన సర్దార్ మంజీత్ సింగ్, రాష్ట్ర బృందం బుధవారం సిక్కింలో నిర్వహించిన అక్కడి డ్రైవర్ల సంఘం రజతోత్సవానికి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆ రాష్ట్ర సీఎం ప్రేమ్‌సింగ్ గోలేను సన్మానించారు.రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కోశాధికారి సయ్యద్ హసమ్ హుస్సేని, ఉపాధ్యక్షుడు ఈ.పద్మారావు, కార్యదర్శులు కె.నర్సింగరావు, హలీం, జాయింట్ సెక్రెటరీ ఎం.రామచంద్రం పాల్గొన్నారు.

అదృశ్యం కేసు నమోదు

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలో నివాసముండే గుమ్మడి సురేశ్ అదృశ్యమైనట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కన్నూర్ గ్రామానికి గుమ్మడి సురేశ్ జమ్మికుంట పట్టణంలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. బుధవారం వేకువజామున ఇంటినుంచి బయటకు వెళ్లాడు. తండ్రి గుమ్మడి సారయ్యకు వాట్సాప్‌కు 'నా భార్య వేధింపులతో నేను చనిపోతాను' అని మెసేజ్ చేశాడు. సారయ్య సురేశ్ సెల్‌కు ఫోన్ చేయగా.. కాజీపేట రైల్వే పోస్టు గార్డు లిఫ్ట్ చేసి ఫోన్, పర్సు ఇక్కడ పెట్టి ఎవరో వెళ్లిపోయారని తెలిపాడు. దీంతో సారయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వ్యవసాయ పనుల్లో ఫుల్ బిజీ



నాటు వేస్తున్న మహిళా కూలీలు

మానకొండూర్‌రూరల్: వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయ కూలీలు ఉదయం పూటనే వెళ్తుండటంతో గ్రామాలలో సందడి వాతావరణం నెలకొంది. రెండు మూడు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు రైతులు వరిసాగుకు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. బోరుబావుల సౌకర్యం ఉన్నవారు నాట్లు మొదలు పెట్టారు. మండలంలోని రైతులు ఎక్కువగా వరిసాగుకే మొగ్గు చూపుతున్నారని వ్యవసాయాధికారులు తెలిపారు. మండలంలో 36 వేల ఎకరాల వ్యవసాయ భూములుండగా 19వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న 200 ఎకరాలు, పత్తి 1200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని అధికారులు తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి రైతుభరోసాకు 19,798 మంది రైతులకు గాను 18,699 రైతుల జాబితాను ట్రెజరీకి పంపించారు. 12,320 మందిని రైతు బీమాకు అర్హులుగా నమోదు చేశారు. రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని, వర్షాలు సమృద్ధిగా కురిసినప్పుడే పంటలు సాగు చేసుకోవాలని ఏఓ, శ్రీనివాస్‌రెడ్డిసూచించారు.



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు



చిగురుమామిడి: కొండాపూర్‌లో పీరీల వద్ద పిల్లల కోసం వరం పడుతున్న మహిళలు



హుజూరాబాద్‌రూరల్: ధర్మరాజుపల్లిలో..

భక్తిశ్రద్ధలతో మొహర్రం

హుజూరాబాద్‌రూరల్: మండల వ్యాప్తంగా కులమతాలకతీతంగా ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో మొహర్రం జరుపుకున్నారు. మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామంలో పీర్లను వీధుల గుండా ఊరేగించగా భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం, తాడికల్, మొలంగూర్, కొత్తగట్టు, కన్నాపూర్, గద్దపాక, మెట్‌పల్లి, కరీంపేట, అంబాల్‌పూర్, ఇప్పలపల్లి, ఏరడపల్లి తదితర గ్రామాల్లో పీర్లను వీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు సమర్పించారు.

రామడుగు: మండలంలోని గుండి, రామడుగు, వెదిర, దేశరాజ్‌పల్లి, వెలిచాల గ్రామాలలో ముస్లింలు మొహర్రం ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా అలకరించిన పీరీలను ఊరేగించారు. గుండి గ్రామంలో నిర్వహించిన పీరీల ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మార్క్కొండ కిష్టారెడ్డి, నాయకులు చాడ శేఖర్‌రెడ్డి, గుండి ప్రవీణ్, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం ఘనంగా జరుపుకున్నారు. వారం రోజులుగా బొమ్మనపల్లి, కొండాపూర్, ఉల్లంపల్లి, చిగురుమామిడి, రామంచ, ముదిమాణిక్యం, ఇందుర్తి, చిన్నముల్కనూర్, రేకొండతో పాటు పలు గ్రామాల్లో పీర్ల పండుగలో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు పాల్గొన్నారు. దట్టీలు కట్టి, కుడుక బెల్లం, ఊదు చదివించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. సంతానం లేని మహిళలు వరం పట్టారు. డప్పు చప్పుళ్ల మధ్య పీర్లను ఎత్తుకొని ఇంటింటికి తిరుగుతూ భక్తుల నుంచి కానుకలు స్వీకరించారు.



శంకరపట్నం: తాడికల్ గ్రామంలో పీరీల ఊరేగింపు



రామడుగు: గుండి గ్రామంలో పీరీల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

అప్పులు చేసి.. అభివృద్ధి చేశాం

- బిల్లుల కోసం తిప్పలు పడుతున్నం
- గంగాధర మండలంలోని తాజామాజీ సర్పంచుల ఆవేదన




బిల్లులు చెల్లించాలని ఆందోళన చేస్తున్న సర్పంచులు(ఫైల్)

గంగాధర: గ్రామంలో సమస్యల పరిష్కారానికి నిధులు వెచ్చించడంతో పాటు మనఊరు మనబడి పథకంలో ప్రభుత్వ పాఠశాలల్లో లక్షల పనులు చేశాం, రోడ్ల మరమ్మతు, సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటు ఇతర పనులకు సంబంధించి లక్షల్లో బిల్లులు రావాల్సి ఉంది, అప్పు తెచ్చి పనులు చేశాం... వడ్డీ పెరుగుతోంది వెంటనే బిల్లులు విడుదల చేయాలని అధికారులకు మొరపెట్టుకుంటే పైనుంచి నిధులు రావడం లేదంటున్నారని గర్షకుర్తి తాజా మాజీ సర్పంచ్ అలువాల నాగలక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సమస్య ఒక్క నాగలక్ష్మిదే కాదు మండలంలోని 33 గ్రామాల మాజీ సర్పంచులది. ఎవరినీ మందలించినా రూ. పదిలక్షలు, 15 లక్షలు, 18 లక్షలు రావాల్సి ఉందని వాపోతున్నారు. మండలానికి దాదాపు సుమారు రూ. నాలుగు నుంచి ఐదుకోట్లకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

గ్రామాలలో ఏ సమస్య వచ్చినా ప్రజలు మాకే మొర పెట్టుకొనిరి. మురుగుకాలువలు నిండినా, వీధులు శుభ్రం చేయకున్నా, బోరుబావి మోటార్లు కాలిపోయినా, పైపులైన్లు పగిలిపోయినా. వీధి దీపాలు వెలుగపోయినా వెంటనే మరమ్మతులు చేశాం. పనులు చేస్తే మరోసారి సర్పంచ్‌గా అవకాశమిస్తారని సాధారణ పనులతో పాటు సీసీరోడ్లు, మురుగు కాలువలు, సంఘ భవనాలు మంజూరు చేయించాం, వైకుంఠధామాలు, రైతువేదికలు, క్రీడా ప్రాంగణాలు, మన ఊరు మనబడి పథకంలో పాఠశాలల్లో మరమ్మతులు, నిర్మాణం పనులు చేయకుంటే పదవులు పోతాయని అధికారులు బెదిరిస్తే అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తే పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పించండని అధికారులు, ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పన్నులు నామమాత్రంగా వసూలయ్యేవని నెలనెలా వచ్చే ఎస్ఎఫ్‌సీ నిధులు కరెంట్ బిల్లులు, సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ ఇన్‌స్టాల్ మెంటు, డీజిల్ ఖర్చులకు సైతం సరిపోయేవి కాదని, గత ప్రభుత్వ పాలనలో పనులు చేసాం. ప్రస్తుత ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేయాలని గోడును వెల్లబోసుకుంటున్నారు. ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేయడానికి కలెక్టరేటుకు వెళ్తే పోలీసులతో గెంటేయించారని వాపోయారు.


పట్టించుకోవడం లేదు



గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.25 లక్షల బిల్లులు రావాలి. పనులు చేయకుంటే పదువులు ఊడుతాయని బెదిరించిన అధికారులు చేసిన పనులకు బిల్లులు అడిగితే పట్టించుకోవడం లేదు. ఏడాదిన్నరగా తంటాలు పడుతున్నాం. ప్రభుత్వం సమస్య పరిష్కరించాలి.

– సిరిమల్ల మేఘరాజు, తాజామాజీ సర్పంచ్, వెంకటాయిపల్లి

బకాయిలు చెల్లించాలి



మండలంలోని సర్పంచులందరికీ పనులకు సంబంధించిన బిల్లులు రావాలి. సీడీపీ నిధులతో, ఉపాధిహామీపథకంతో పాటు గ్రామ పంచాయతీలో చేపట్టిన పనులకు సంబంధించి లక్షల రూపాయలు రావాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలి.

– వేముల దామోదర్, తాజమాజీ సర్పంచ్, కాసారం

రెగ్యులర్ కార్యదర్శిని కేటాయించాలని వినతి



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న శంకర్, సురేశ్, ప్రేమ్‌కుమార్, నరేశ్

మానకొండూర్: మానకొండూర్ గ్రామానికి రెగ్యులర్ కార్యదర్శిని కేటాయించాలని డీసీసీ అధికార ప్రతినిధి కొత్తకొండ శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోండ్ర సురేష్, సీనియర్ నాయకుడు, మాజీ వార్డ్ మెంబర్ మడుపు ప్రేమ్‌కుమార్, తాళ్లపల్లి నరేశ్ బుధవారం మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పారిశుధ్య వ్యవస్థ కుంటుపడిందని, వీధి దీపాలు వెలగడం లేదని, రెగ్యులర్ కార్యదర్శి సస్పెండ్‌తో నలుగురు ఇన్‌చార్జి కార్యదర్శులు మారారని, నాలుగు రోజులకోసారి కార్యదర్శి మారేసరికి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. చిన్నపాటి వర్షానికి వీధుల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయని వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో రెగ్యులర్ కార్యదర్శిని కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఘనంగా బీరప్ప బోనాలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామంలో గొల్లకురుమలు బుధవారం బీరప్ప బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో మధ్య మహిళలు నెత్తిన బోనాలతో వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయం ఆవరణలో కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గొల్లకురుమలు, కుల పెద్దలు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కారంచేడు మృతులకు నివాళి

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కారంచేడు మృతులకు ఎమ్మార్పీస్, అనుబంధ సంఘాల నాయకులు బుధవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రుద్రారపు రాంచంద్రం మాదిగ మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కారంచేడు గ్రామంలో 1985 జూలై 17న మాదిగలు తాగే మంచినీటి చెరువులో పశువులను కడుగుతూ నీటిని కలుషితం చేశారని మున్నంగి సువార్త, కత్తి చంద్రయ్య అడ్డుకోగా ఆగ్రహించిన భూస్వాములు తెల్లవారుజామున మాదిగల ఇళ్లపై దాడి చేయగా ఏడుగురు చనిపోగా, అనేక మంది గాయపడ్డారని, ఘటనకు నిరసన మాదిగలు ఐక్యంగా పోరాటం చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఉద్యమాలు చేశారని తెలిపారు. మాదిగలు ఐక్యంగా ఉంటేనే ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సైదాపూర్ మాజీ ఎంపీపీ పాడిశెట్టి వెంకటరాజం, హుజూరాబాద్ జిల్లా సాధన జేఏసీ కన్వీనర్ భీమోజు సదానందం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన నేరెళ్ల శారద రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హైదరాబాద్ తరలివెళ్లి శారదకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి శారదుకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.



నేరెళ్ల శారదను అభినందిస్తున్న రామడుగు మండలం నాయకులు



నీరంతా వృథా.. రైతన్న వ్యథ

వీణవంక: మండలంలోని భేతిగల్ గ్రామ ఊర చెరువు తూము వద్ద బుంగ పడి నీరు వృథాగా పోతోంది. దీంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. చెరువు పరిధిలో సుమారు 25 ఎకరాలు సాగవుతుందని, మరమ్మతులు చేయాలని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

21న రజతోత్సవాలు

కరీంనగర్ కల్చరల్: హైదరాబాద్‌లో ఈ నెల 21న శ్రీవైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి శశికిరణ్ ఆచార్యులు తెలిపారు. సంబంధిత పోస్టర్లను బుధవారం నగరంలో ఆవిష్కరించారు. ఆలయాల్లో బ్యానర్లు కట్టి, స్టిక్కర్లను అంటించి, ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ మన్నెగూడ, జీఎంఆర్ సార్థ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటల నుంచి ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు జిల్లా శాఖ భవనం నుంచి ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని, ప్రతీ శ్రీవైష్ణవ బాంధవుడు కుటుంబంతో సహా హాజరై, విజయవంతం చేయాలని కోరారు. శ్రీవైష్ణవ సేవా సంఘం జిల్లా శాఖ భవనం, సప్తగిరికాలనీ కోదండ రామాలయం, కోతిరాంపూర్ పంచముఖ హనుమత్ పీఠం, వేదభవనంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాడభూషణి శ్రీనివాసాచార్యులు, వానమామలై శ్రీనివాసాచార్యులు, కేఎస్.అనంతాచార్యులు, నమిలికొండ అనిల్‌కుమార్, కలకుంట్ల వేదాంతాచార్యులు, సముద్రాల వేణుగోపాలాచార్యులు, నమిలకొండ రాజగోపాలాచార్యులు, సముద్రాల అనంతరామాచార్యులు, వేదభవనం విద్యార్థులు పాల్గొన్నారు.